
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 29 । మార్చి । 2025



ఉపాధ్యాయ సమస్యలు..
పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, డీఏ, పీఆర్సీ తదితర సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. 11లో





వాతావరణం
జిల్లాలో శనివారం ఉదయం నుంచే ఎండ తీవ్రత మొదలై మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వడ గాలులు వీస్తాయి.

విద్యుత్ ఎస్ఈతో...

నేడు 'సాక్షి' ఫోన్ ఇన్


జి.మహేందర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) జి.మహేందర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి పాటుపడేలా 'సాక్షి' నిర్ణయించింది. ఈమేరకు ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎస్ఈకి వివరించేలా 'ఫోన్ ఇన్' నిర్వహిస్తోంది. కొత్త కనెక్షన్ల మంజూరులో జాప్యం, అదనపు లోడ్‌తో ఇక్కట్లు, సరఫరాలో అంతరాయాలు, వేలాడుతున్న తీగలు తదితర సమస్యలపై ప్రజలు వివరిస్తే వాటి పరిష్కార మార్గాలపై ఎస్ఈ సమాధానమిస్తారు.

తేదీ : 29 - 03 - 2025, శనివారం
సమయం : ఉదయం 11నుంచి 12గంటల వరకు
ఫోన్ చేయాల్సి నంబర్లు :
79010 93954, 94402 43926


న్యూస్‌రీల్

మాడ వీధుల విస్తరణకు లైన్ క్లియర్
నిర్వాసితులకు చెక్కుల పంపిణీ


నిర్వాసితులతో ఆర్డీఓ దామోదర్ రావు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి మార్గం సుగమమైంది. విస్తరణ పనులకు అధికారులు రెండెకరాల స్థలం సేకరించారు. ఆలయానికి సీఎం రేవంత్ రెడ్డి తొలి విడతగా రూ. 60 కోట్లను ప్రకటించి, రూ. 35 కోట్లు విడుదల చేశారు. దీంతో భూ, ఇళ్ల నిర్వాసితులకు శుక్రవారం నష్టపరిహారం అందజేశారు. ఆర్డీఓ దామోదర్‌రావు తన కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేశారు. 17 కుటుంబాలకు రూ. 10.82 కోట్లను అందించారు. మిగతావారికి శనివారం చెక్కులు ఇస్తామని, మొత్తంగా 40 కుటుంబాలకు రూ.34.45 కోట్లు అందజేయాల్సి ఉందని వెల్లడించారు. కాగా ఏప్రిల్ 6న ఆలయ అభివృద్ధి, మాడ వీధుల విస్తరణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేసే అవకాశం ఉంది.

స్వర్ణకవచధారణలో రామయ్య


నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అంతరాలయంలోని స్వామివారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారణలో దర్శనమిచ్చారు. బేడా మండపంలో రామయ్య స్వామిని కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం తదితర పూజలు నిర్వహించారు. నిత్య కల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. ఐఆర్ఎస్ అధికారులు శ్రీనివాసరావు, శ్రీదేవి శ్రీ సీతారామ చంద్రస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. మహారాష్ట్రకు చెందిన భక్తులు పవన్‌కుమార్, కామాక్షి దంపతులు ఆలయానికి రూ. లక్ష విరాళం అందించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.


- రామాలయానికి విద్యుత్ వెలుగులు.. భక్తులకు నీడ సౌకర్యం
- భద్రాచలంలో సీఎస్సార్ నిధులు వినియోగించుకునే అవకాశం
- కరకట్ట వెంబడి వసతులు కల్పించాలని కోరుతున్న భక్తులు

భద్రాచలంలో సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేస్తే గోదావరి కరకట్ట ఇలా మారనుంది..



వెలుగునీడలు ఉండేలా..

కరకట్టపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేస్తే ఉపయోగం



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి వరద నుంచి భద్రాచలం పట్టణానికి రక్షణ కల్పించేందుకు 20 ఏళ్ల కిందట కరకట్ట నిర్మించారు. రెండు దశాబ్దాలు దాటినా కరకట్టను తగినవిధంగా వినియోగించే చర్యలు కానరావడం లేదు. 20 ఏళ్ల క్రితం ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో చర్ల రోడ్డులో ఉన్న ఎటపాక నుంచి భద్రాచలం మీదుగా కూనవరం రోడ్డులో పట్టణ సరిహద్దు వరకు కరకట్ట నిర్మాణం మొదలెట్టారు. మొదటి దశలోనే 7.5 కిలోమీటర్ల మేర నిర్మించారు. ఇందులో గోదావరి వంతెన నుంచి ఆంజనేయస్వామి విగ్రహం మీదుగా సీడబ్ల్యూసీ ఫ్లడ్ మెజర్‌మెంట్ పాయింట్, స్నానఘట్టాలు, గోదావరి మాత విగ్రహం, గంగమ్మ తల్లి గుడి వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేరకు కరకట్టపై సిమెంట్ రోడ్డు నిర్మించారు. అక్కడక్కడా బెంచీలు వేశారు. కరకట్ట దిగువ భాగంలో రామాయణ ఇతివృత్తాన్ని తెలిపే విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆ తర్వాత చెప్పుకోదగ్గ మార్పులేమీ లేవు. గత పుష్కరాల సందర్భంగా కొత్త స్నానఘట్టాలు, ఐటీవల వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం మరో ఘాట్ నిర్మాణం చేపట్టారు. కాగా అప్పుడు అర్ధంతరంగా ఆగిపోయిన కరకట్ట పనులు తాజాగా మళ్లీ మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుత అవసరాలకు తగినట్లు కరకట్ట వెంబడి మరిన్ని సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.

కరకట్ట ఎక్కితే కాళ్లకు బొబ్బలే

రాష్ట్రంలోనే వేసవిలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో భద్రాచలం ఒకటి. ముఖ్యంగా శ్రీరామ నవమి సమయంలో ఎండలు మండిపోతుంటాయి. గోదావరి తీరంలో పవిత్ర స్నానం చేసేందుకు వచ్చే భక్తులకు నిలువ నీడ ఉండని పరిస్థితి ఇప్పుడు నెలకొంది. ఎంతో దూరం నుంచి వచ్చే భక్తులు కరకట్టపైకి ఎక్కి గోదావరి అందాలను కనీసం నిమిషం సేపు కూడా ప్రశాంతంగా చూడలేకపోతున్నారు. వానాకాలంలో చినుకులు పడితే తలదాచుకునే చోటు ఉండదు. పర్వదినాల్లో వచ్చే సామాన్య భక్తులు ఆరుబయట కరకట్ట చెంతన సేద తీరాల్సి ఉంటుంది.

సౌకర్యవంతంగా..

రెండేళ్ల క్రితం హైదరాబాద్ నగరంలో ఔటర్ రింగురోడ్డు వెంబడి 23 కిలోమీటర్ల మేర సోలార్ రూఫ్ సైక్లింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. ఇందుకోసం రూ. 35 కోట్లు ఖర్చు చేయగా, 14 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. ఇదే తరహాలో భక్తులకు నీడ ఇవ్వడంతోపాటు గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసేలా గోదావరి కరకట్ట సిమెంటు రోడ్డుపై సోలార్ ప్యానెళ్లతో రూఫ్ ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు. పట్టణానికి రక్షణగా పాత కరకట్ట 7.5 కి.మీ పొడవుతో రెడీగా ఉండగా కొత్త కరకట్ట ఇంచుమించు కిలోమీటరు అందుబాటులో ఉంది.

ఆలయ అలంకరణ.. భక్తులకు నీడ

ప్రస్తుతం ముక్కోటి, శ్రీరామనవమి, ఇతర పర్వ దినాల్లో తప్పితే భద్రాచలం దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంలేదు. రాత్రి వేళలో ఆలయం చీకట్లోనే ఉండిపోతోంది. సోలార్ పవర్ ఉంటే ఏడాదంతా ఖర్చు లేకుండా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించే వీలు కలుగుతుంది. మరోవైపు సోలార్ ప్యానెళ్లు పై కప్పుగా ఉపయోగపడటం వల్ల కరకట్ట వెంబడి నడిచే భక్తులకు ఎండ నుంచి నీడ, వాన నుంచి రక్షణ కల్పించినట్టు అవుతుంది.

సీఎస్ఆర్ ఉందిగా !

ఆలయ ప్రాంగణంలో సోలార్ వెలుగులు అందించే కార్యక్రమం గతేడాది మొదలైనా ఆదిలోనే ఆగిపోయింది. మిథిలా స్టేడియంలో గ్యాలరీల పైకప్పు ప్రాంతంలో కొద్ది మేరకు సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేశారు. దీని వల్ల భక్తులకు ఒనగూరిన ప్రయోజనం పెద్దగా ఏమీ లేదు. జిల్లాలో అనేక పరిశ్రమలు విస్తరించి ఉన్నాయి. దాదాపుగా అన్ని పరిశ్రమలు గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఈ క్రమంలో భద్రాచలం కరకట్టపై సోలార్ రూఫ్ టాప్ నిర్మాణం చేసేందుకు పరిశ్రమల సహకారం తీసుకునే అంశాన్ని జిల్లా అధికారులు పరిగణిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇక లబ్ధిదారుల పేర్లతో ఫ్లెక్సీ..

- త్వరలో గ్రామ ప్రధానకూడళ్లలో రుణమాఫీ వివరాల ప్రదర్శన
- వ్యవసాయశాఖ అధికారుల కసరత్తు
- జిల్లాలో 61,409 మంది రైతులకు రుణమాఫీ



బూర్గంపాడు: రైతుల రుణమాఫీపై ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు గ్రామాల వారీగా రుణమాఫీ అయిన రైతుల వివరాలతో కూడిన ఫ్లెక్సీని గ్రామ ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టింది. బ్యాంకుల్లో రూ. 2 లక్షల వరకు పంట రుణాలున్న రైతులకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం రుణమాఫీ అమలు చేసిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వం నాలుగు విడతలుగా రూ.లక్ష వరకు రుణమాఫీ చేయగా, దీంతో రైతులకు మేలు జరగలేదని గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా విమర్శించిన కాంగ్రెస్ నేతలు.. తాము అధికారంలోకి వస్తే రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రూ. 2 లక్షల లోపు పంట రుణాలను ప్రస్తుత ప్రభుత్వం మాఫీ చేసింది. అయితే ప్రతిపక్ష బీఆర్ఎస్ మాత్రం రుణమాఫీపై విమర్శలు చేస్తూనే ఉంది. 30 శాతం మంది రైతులకు మాత్రమే రూ.2లక్షల రుణం మాఫీ చేసి, అందరికీ చేసినట్టుగా చెప్పుకుంటోందని ఆరోపణలు చేస్తోంది. కాగా, ఆ పార్టీ వైఖరిని తిప్పికొట్టి తమ ప్రభుత్వం రైతులకు చేసిన మేలును అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని భావించిన ప్రభుత్వం.. రుణమాఫీ అయిన, రైతు భరోసా అందిన వారి వివరాలతో ఫ్లెక్సీలు వేయించి ఒక్కో గ్రామంలో కనీసం మూడు ప్రధాన కూడళ్లలో ప్రదర్శించేలా ఏర్పాట్లు చేస్తోంది. ఉగాది నాటికి ప్రదర్శించేలా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలో రూ.435.55 కోట్లు మాఫీ..

జిల్లాలో రూ.2 లక్షల లోపు పంట రుణాలు తీసుకున్న 61,409 మంది రైతులకు చెందిన రూ.435.55 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. మొత్తం రుణాల్లో ఒక వంతు మాత్రమే మాఫీ అయిందని, ఇంకా రెండొంతుల మేర మాఫీ కావాల్సి ఉందని రైతు సంఘాల నాయకులు చెబుతున్నారు. ఇందుకోసం వేలాది మంది రైతులు ఎదురు చూస్తున్నట్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం రైతులకు విడివిడిగా కాకుండా రేషన్ కార్డు ఆధారంగా రుణమాఫీ చేసింది. తద్వారా కుటుంబ సభ్యులందరికీ కలిపి రూ. 2లక్షల రుణాలు మాఫీ అయ్యాయి. అది కూడా అన్ని బ్యాంకుల్లో కలిపి రూ. 2 లక్షల వరకు రుణం ఉంటేనే వర్తించింది. ఇలాంటి షరతులతో జిల్లాలో వేల మంది రైతులకు రుణమాఫీ కాలేదు. కొందరు రైతులు తమ రుణాన్ని రూ. 2 లక్షలకు తగ్గించుకునేందుకు బ్యాంకులకు వెళ్లి కొంతమేర చెల్లించినా.. వారికి కూడా రుణమాఫీ కాలేదు. రేషన్‌కార్డుతో అనుసంధానం చేసిన జాబితా ఆధారంగానే రుణమాఫీ అమలైంది.

స్థానిక ఎన్నికల కోసమే..?

రుణమాఫీతోపాటు రైతు భరోసా వివరాలను కూడా ప్రచారం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఇప్పటివరకు నాలుగెకరాల లోపు పట్టా భూములున్న రైతుల ఖాతాల్లోనే 'భరోసా' జమ కాగా ఈ ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. రైతులకు మేలు చేస్తున్న తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగానే విమర్శలు చేస్తున్నాయంటున్న సర్కారు.. వాటిని తిప్పికొట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్న ప్రభుత్వం ఈ ప్రచారం ద్వారా లబ్ధి పొందాలని యోచిస్తోంది.

డల్ ఆర్ఎస్..!

- ఎల్ఆర్ఎస్‌కు ఆదరణ అంతంతే
- రాయితీ ఇచ్చినా ఆసక్తి చూపని యజమానులు
- మరో మూడు రోజుల్లో ముగియనున్న గడువు
- లక్ష్యం నెరవేరని ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ

పాల్వంచరూరల్: అనుమతిలేని ప్లాట్ల క్రమబద్ధీకరణ గడువు మూడు రోజుల్లో ముగియనుంది. మొదటి నుంచి ఎల్ఆర్ఎస్ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. ప్రభుత్వం రాయితీ కల్పించినా ఫీజు చెల్లించేందుకు యజమానులు ఆసక్తి చూపడంలేదు. అధికారులు, సిబ్బంది ఫోన్లు చేసి అవగాహన కల్పిస్తున్నా స్పందన అంతంతమాత్రంగానే ఉంటోంది. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీల పరిధిలో అనుమతిలేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)ను అమలు చేస్తోంది. ఫీజులో 25శాతం రాయితీ కల్పించి, ఈ నెల 31 వరకు గడువు విధించింది. దరఖాస్తుల ఆధారంగా రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, పంచాయతీశాఖల అధికారులతో ప్రత్యేక బృందాలు నియమించి సర్వే చేపట్టింది. ఎల్ఆర్ఎస్‌కు మున్సిపాలిటీల్లో కాస్త ఆదరణ ఉన్నా పంచాయతీల పరిధిలో మాత్రం యజమానులు ముందుకు రావడం లేదు. దీంతో గడువులోగా లక్ష్యం చేరే పరిస్థితి కనిపించడంలేదు.

25శాతం రాయితీ..

అనుమతులేని లేఅవుట్‌లలో ఇంటి స్థలాలు కొనుగోలు చేసినవారు ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2020లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించింది. డాక్యుమెంట్‌పై ఉన్న ధరలో 14 శాతం ఫీజు చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది. క్రమబద్ధీకరణ పూర్తయిన ప్లాట్లలోనే భవన నిర్మాణాలకు అనుమతులు ఇస్తామని పేర్కొంది. దీంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలువురు రూ.1100 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఎల్ఆర్ఎస్ ప్రక్రియ ఆగిపోయింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎల్ఆర్ఎస్ ప్రక్రియ పూర్తిచేసేందుకు 25శాతం రాయితీ వెసులుబాటు కల్పించింది.

మూడు దశల్లో పరిశీలన

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను అధికారులు మూడు దశల్లో పరిశీలిస్తున్నారు. తొలిదశలో(ఎల్-1) రెవెన్యూ గిర్దావర్, గ్రామకార్యదర్శి, జలవనరులశాఖ అధికారి కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అన్ని కాగితాలు సక్రమంగా ఉన్న దరఖాస్తులను ఎల్-2 దశకు పంపిస్తారు. మున్సిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్, గ్రామపంచాయతీల్లో డీపీఓ స్థాయి అధికారులు రెండోసారి క్షేత్రస్థాయిలో పరిశీలన జరుపుతున్నారు. అన్నీ సక్రమంగా ఉంటే ప్లాట్‌కు ఫీజు చెల్లించేలా దరఖాస్తుదారుని సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపిస్తారు. ఫీజు చెల్లించాక దరఖాస్తును ఎల్-3 దశకు పంపిస్తారు. అప్పుడు అదనపు కలెక్టర్ పరిశీలించి, కలెక్టర్ ఆమోదంకోసం పంపుతారు. ఆ తర్వాత క్రమబద్ధీకరణ చేస్తారు.

దరఖాస్తుల వివరాలు

జిల్లా వ్యాప్తంగా ఎల్ఆర్ఎస్‌కు 15,118 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 13 మండలాల పరిధిలోని గ్రామపంచాయతీల్లో 3,312 మంది దరఖాస్తు చేసుకోగా పెండింగ్‌లో 7,83 దరఖాస్తులు ఉన్నాయి. మిగతావి పరిష్కరించి ఫీజు చెల్లించేందుకు అవకాశం కల్పించారు. మున్సిపాలిటీల పరిధిలో 11,806 మంది దరఖాస్తు చేసుకోగా, పెండింగ్‌లో 1,597 దరఖాస్తులు ఉన్నాయి. మొత్తంగా 2,380 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా మిగతా దరఖాస్తుదారులు ఫీజు చెల్లించాలని సమాచారం ఇచ్చారు. కానీ యజమానులు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించేందుకు ఆసక్తి చూపడంలేదు. ఇప్పటివరకు మున్సిపాలిటీల్లో రూ.9.90 కోట్లు, గ్రామపంచాయతీల్లో రూ. 2.32 కోట్లను ఫీజు రూపంలో స్థలాల యజమానులు చెల్లించారు. పాల్వంచలో అత్యధికంగా రూ. 8.62 కోట్ల ఫీజు కట్టారు. కొత్తగూడెంలో రూ. 78 లక్షలు చెల్లించగా, మణుగూరు, ఇల్లెందు మున్సిపాలిటీల్లో రూపాయి కూడా చెల్లించలేదు. ఇంకా మున్సిపాలిటీల పరిధిలో సుమారు 5 వేలు, గ్రామపంచాయతీల పరిధిలో 5 వేల మందికిపైగా దరఖాస్తుదారులు ఫీజు చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఫోన్లు చేసినా యజమానులు స్పందించడంలేదని పేర్కొంటున్నారు.


పాల్వంచలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన(ఫైల్)

గడువులోగా పూర్తిచేస్తాం

గడువులోగా ఎల్ఆర్ఎస్ పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. అధికారులు, సిబ్బందితో యజమానులకు అవగాహన కల్పిస్తున్నారు. దరఖాస్తుదారులకు ఫోన్లు కూడా చేయిస్తూ సర్వే ప్రక్రియ కొనసాగిస్తున్నాం. ఎల్ఆర్ఎస్ ఫీజు ద్వారా ఇప్పటివరకు రూ.12.22 కోట్ల ఆదాయం లభించింది.
–విద్యాచందన, అదనపు కలెక్టర్

పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలి
సీఎంకు అశ్వారావుపేట ఎమ్మెల్యే వినతి


సీఎంను కలిసిన మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు ఆదినారాయణ, వెంకట్రావు, వెంకటేశ్వర్లు

అశ్వారావుపేట: అశ్వారావుపేట నియోజకవర్గంలో పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు ముఖ్యమంత్రిని కలిశారు. శాంతిభద్రతలను మెరుగుపరిచేందుకు నియోజకవర్గంలోని ఐదు మండలాలను కలిపి పోలీస్ సబ్ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు ఉన్నారు.

ఇఫ్తార్ విందుతో ఐక్యతాభావం


ఇఫ్తార్ విందుకు హాజరైన ఎమ్మెల్యే, కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్ తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇఫ్తార్ విందు ప్రజల మధ్య ఐక్యతాభావం పెంపొందిస్తుందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని శుక్రవారం రాత్రి కొత్తగూడెం క్లబ్‌లో కొత్తగూడెం పట్టణం, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్ మండలాలస్థాయిలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముస్లింలతో కలిసి నమాజ్ చేశారు. ఉపవాసదీక్ష విరమించిన ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మతసామరస్యాన్ని చాటుతూ లౌకిక విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల ఆచార వ్యవహారాలను గౌరవిస్తూ పండుగల సమయంలో అధికారిక కార్యక్రమాలను చేపట్టడం అభినందనీయమన్నారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా, మైనార్టీ నాయకుడు నయీం ఖురేషి, డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, మత పెద్దలు జహంగీర్ షరీఫ్, రబ్‌సాబ్, అబీద్ హుస్సేన్, జావీద్ సాటే, బాసిత్, ఖాద్రి, యాకూబ్, సీపీఐ నాయకులు దుర్గరాశి వెంకన్న, వాసిరెడ్డి మురళి, కాంగ్రెస్ నాయకులు తూము చౌదరి, నాగా సీతారాములు, పల్లపోతు సాయి పాల్గొన్నారు.

క్లుప్తంగా

అశ్వాపురం సంత రూ.5.80 లక్షలు



ప్రసాద్‌కు హక్కుపత్రం అందజేస్తున్న అధికారులు

అశ్వాపురం: మండల కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే వారపు సంతకు శుక్రవారం ఎంపీడీఓ, పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ గంటా వరప్రసాద్ అధ్యక్షతన జీపీ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. 36 మంది వేలంపాటలో పాల్గొన్నారు. సంత వేలాన్ని రూ.5,80,000కు కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కుంజా ప్రసాద్ దక్కించుకున్నారు. ఏప్రిల్ 1 నుంచి 31 మార్చి 2026 వరకు హక్కుదారులుగా ఉంటారు. పంచాయతీ కార్యదర్శి మల్లేశం, గ్రామ పంచాయతీ అబ్జర్వర్ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్ష

కొత్తగూడెంఅర్బన్: పదో తరగతి పరీక్షల్లో భాగంగా శుక్రవారం జరిగిన సైన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈఓ ఎం.వెంకటేశ్వరచారి తెలిపారు. పరీక్షకు రెగ్యులర్ విద్యార్థులు 12,273 మందికి గాను 12,238 మంది.. సప్లిమెంటరీ విద్యార్థులు 472 మందికి గాను 427 మంది హాజరయ్యారు. జిల్లా పరిశీలకులు విజయలక్ష్మీబాయి నాలుగు సెంటర్లు, డీఈఓ మూడు సెంటర్లు, ఫ్లయింగ్ స్క్వాడ్ 17 సెంటర్లు తనిఖీ చేశారు. ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలి

చంద్రుగొండ : ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.బాబూరావు సూచించారు. చంద్రుగొండలో శుక్రవారం ఆయన పురుగుమందులు, విత్తన దుకాణాలను, మన గ్రోమోర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులను, పురుగు మందులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పాం సేద్యంతో అధిక ఆదాయం వస్తుందని అన్నారు. జిల్లాలో రబీ సీజన్‌లో 63 వేల ఎకరాల్లో వరి సాగవుతున్నట్లు తెలిపారు. ఏఓ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నరేంద్రకుమార్



చంద్ర నరేంద్రకుమార్

జూలూరుపాడు: తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా జూలూరుపాడుకు చెందిన చంద్ర నరేంద్రకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ నెల 25, 26, 27వ తేదీల్లో నిజామాబాద్‌లో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా నరేంద్రకుమార్‌ను ఎన్నుకోగా.. శుక్రవారం పలువురు అభినందించారు.

ఓబీ వెలికితీతలో పీకేఓసీ రికార్డు

వరుసగా ఐదోసారి అవార్డు అందుకోనున్న గని

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని పీకేఓసీ-2 గని గురువారం ఒక్కరోజు లక్షా నాలుగు వేల క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తీసి మరోసారి సత్తాచాటింది. సాధారణంగా మూడు షిఫ్టుల్లో కలిపి రోజువారీ లక్ష్యం 62 వేలు ఉండగా, 22.5 గంటల్లోనే లక్షా నాలుగు వేల ఓబీ వెలికితీసి ఓసీ-2 ఘనత సాధించింది. 2021 మార్చిలో 1,01,000 క్యూబిక్ మీటర్ల ఓబీ తీసి రికార్డు సృష్టించగా, ఇప్పుడు అంతకుమించి ఓబీ వెలికితీసి రికార్డును తిరగరాసింది. 2020 నుంచి 2023-24 ఆర్థిక సంవత్సరాల్లో సింగరేణి డే డిసెంబర్ 23న యాంత్రిక సామర్థ్య వినియోగంలో బెస్ట్ పర్ఫామెన్స్ అవార్డును ఓసీ-2 అందుకోగా, ఈ ఏడాది కూడా మరోసారి ఆ అవార్డును అందుకోనుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. అత్యధిక ఓబీ రావడంతో సింగరేణి సీఎండీ బలరాంనాయక్, డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్ (పీపీ) కె.వెంకటేశ్వర్లు, ఏరియా జీఎం దుర్గం రాంచందర్, పీఓ లక్ష్మీపతిగౌడ్, ఏరియా అధికారులు, యూనియన్ ప్రతినిధులు, కార్మికులను, అభినందించారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని అశోక్‌నగర్‌కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. కాలనీలో నివాసం ఉండే రాజేశ్ కుటుంబ సభ్యులతో కలిసి బయటకెళ్లారు. శుక్రవారం సాయంత్రం ఇంటి ముందు మంటలు ఎగిసి పడుతుండటంతో స్థానికులు వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించగా.. వారు ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ బీరువాలోని సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.3 లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని ఫైర్ అధికారులు తెలిపారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.20,871

బతుకు శిథిలం



క్రేన్ల సాయంతో శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం

- భవన శిథిలాల్లో మరొకరు విగతజీవిగా..
- మూడు రోజుల రెస్క్యూ ఆపరేషన్ పూర్తి

భద్రాచలంఅర్బన్: భవనం కుప్పకూలిన ఘటనలో ఇద్దరి జీవితాలు ముగిసిపోయాయి. భవన శిథిలాల్లాగే వీరి కుటుంబాలు కూడా శిథిలమయ్యాయి. మూడు రోజులుగా ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, ఐటీసీ బృందాలతో కొనసాగిన రెస్క్యూ ఆపరేషన్‌లో శుక్రవారం తెల్లవారుజామున 1.42 నిమిషాలకు ఉపేందర్ విగతజీవిగా దొరికాడు. అనంతరం అధికారులు మిగిలి ఉన్న శిథిలాలను కూడా పూర్తిగా తొలగించే ప్రక్రియను శుక్రవారం ఉదయం చేపట్టగా, వాటి కింద ఎవరూ లేరని నిర్ధారణకు వచ్చారు. అనంతరం రెస్క్యూ ఆపరేషన్ పూర్తయినట్లు భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు వెల్లడించారు. కాగా ఈ ఘటన బుధవారం మధ్యాహ్నం 2.45 సమయంలో జరిగింది. ఆ సమయంలో పనులు చేస్తూ మొత్తం ఆరుగురు శిథిలాల మధ్య చిక్కుకున్నట్లు వదంతులు వ్యాపించాయి. దీంతో జిల్లా యంత్రాంగం అంతా ఒక్కసారిగా అప్రమత్తమైంది. హుటాహుటిన భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ ఘటనా స్థలానికి చేరుకోగా, కొద్దినిమిషాల గ్యాప్‌తో ఎస్పీ రోహిత్‌రాజు కూడా ఘటన జరిగిన ప్రదేశానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టేందుకు పలు సూచనలు ఇచ్చారు. ఈ క్రమంలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్ భవనం కూలిన ప్రదేశం వద్దకు చేరుకుని శిథిలాల మధ్య ఎంత మంది ఉన్నారు? ఎటువైపు ఉన్నారు? శిథిలాలను ఎలా తొలగించాలి? అని రెస్క్యూ బృందాలతో చర్చించి పనులు ప్రారంభించారు. వెనుక వైపు నుంచి లోపలికి ప్రవేశించేందుకు చేసిన యత్నం విఫలం కావడంతో మరోవైపు నుంచి రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టగా రెండు గంటల అనంతరం శిథిలాల కింద ఓ వ్యక్తి (కామేశ్వరరావు) ఉన్నట్లు గుర్తించారు. తీవ్రంగా శ్రమించి గురువారం బాధితుడిని బయటకు తీసి, చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించిన కొద్దిసేపటికే మృతిచెందాడు. తిరిగి గురువారం ఉదయం 8.30 గంటలకు రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించిన అధికారులు ఎట్టకేలకు శుక్రవారం తెల్లవారుజామున 1.42 గంటలకు ఉపేందర్ ఎడమకాలు కనిపించడంతో ఆ ప్రాంతంలో ఉన్న శిథిలాలను క్రేన్, డ్రిల్లింగ్ మిషన్ల ద్వారా పక్కకు జరిపి అతడి మృతదేహాన్ని బయటకు తీసి, ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. అనంతరం మిగిలి ఉన్న భవన శిథిలాలను క్రేన్ల సాయంతో తొలగించారు.

మార్చురీ ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

భద్రాచలంటౌన్: పట్టణంలోని సూపర్‌బజార్ సెంటర్లో కూలిన భవనం శిథిలాల కిందపడి మృతి చెందిన కార్మికులను ఆదుకోవాలని సీపీఎం, సీఐటీయూ, సామాజిక సంఘాల నేతృత్వంలో ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. గుట్టుచప్పుడు కాకుండా పోస్టుమార్టం చేయాలనే అధికారుల ప్రయత్నాన్ని ఆందోళనకారులు అడ్డుకున్నారు. మృతుల కుటుంబాలకు సాయం అందిన తర్వాతనే పోస్టుమార్టం చేయాలని ఐదు గంటల పాటు ధర్నా చేశారు. దీంతో భద్రాచలం ఆర్డీఓ, ఎమ్మెల్యే తెల్ల వెంకట్రావు ఆందోళనకారులతో మాట్లాడి.. ఇంటి యజమానితో చర్చించి ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం ఇచ్చేవిధంగా ఒప్పందం కుదిర్చారు. దహన సంస్కారాలకు తక్షణ సాయంగా కుటుంబానికి రూ.లక్ష అధికారులు అందించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వపరంగా అందాల్సిన సాయంతో పాటు మృతుల కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇల్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగం, పిల్లలకు ఉచిత విద్య అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ధర్నాలో పలువురు నాయకులు ఏజే రమేశ్, ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, వెంకటరామారావు, భూపేంద్ర, రత్నం, అలవాల రాజా, సునీల్, శివప్రశాంత్, నవాబ్, తిరుపతిరావు, రమాకాంత్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆపరేషన్ అలా..



ప్రమాదం జరిగిన రోజు..



రెండో రోజు శిథిలాలను తొలగిస్తున్న దృశ్యం



శిథిలాల తొలగింపు పూర్తయిన తర్వాత..

భద్రాచలంలో కూలిన ఐదంతస్తుల భవన నిర్మాణం కింద ఇద్దరు కార్మికులు మృతి చెందారు. జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి సింగరేణి రెస్క్యూ టీంను రంగంలోకి దించి సహాయక చర్యలు ప్రారంభించి, శిథిలాల తొలగింపునకు ఐటీసీ నుంచి తెప్పించిన క్రేన్ల సాయంతో ప్రక్రియ మొదలు పెట్టారు. ఇలా బుధవారం మధ్యాహ్నం మొదలు పెట్టిన సహాయ చర్యలు, శుక్రవారం ఉదయం వరకు కొనసాగాయి. మూడు రోజులపాటు శ్రమించిన రెస్క్యూ సిబ్బంది ఇద్దరి మృతదేహాలను వెలికి తీశారు. ఆయా కుటుంబాల్లో ఈ ఘటన మాత్ర తీవ్ర విషాదం నింపింది. భద్రాచలంఅర్బన్

వాటర్‌షెడ్ పథకంతో ఉపయోగాలు



చెట్టుపల్లిలో వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమంలో అధికారులు, రైతులు

గుండాల: వర్షాకాలంలో వృథాగా వెళ్లిపోయే నీటిని మళ్లింపు కాల్వల ద్వారా కుంటలు నిర్మించుకుని నిల్వ చేసుకోవాలని, తద్వారా భూగర్భ జలాలను కాపాడుకోచ్చని డీపీఎం రంగనాథ్, ఏడీఏ తాతారావు తెలిన్నారు. వాటర్‌షెడ్ యాత్ర కార్యక్రమాన్ని శుక్రవారం గుండాల మండలంలో చెట్టుపల్లి, శంభూనిగూడెం, ఆళ్లపల్లి మండలంలో బోడాయికుంట, నడిమిగూడెం గ్రామాల్లో ప్రారంభించారు. ముందుగా ఆయా పాఠశాలల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుంటలు నిర్మించుకుంటే చిన్నచిన్న పంటలు సాగు చేయడానికి ఉపయోగపడుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సత్యనారాయణ, తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఎంపీఓ శ్యాంసుందర్‌రెడ్డి, ఆళ్లపల్లి ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ సీతారామారావు, ఏఓ అనిల్, ఏపీఎం రామ్‌కుమార్, ఏపీఓ రఘునాథ్, ఎంఈఓ శాంతారావు, కార్యదర్శి అనురాధ, టీఏలు భద్ర, కృష్ణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం పొందాలి



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ

ములకలపల్లి: రైతులు తక్కువ పెట్టుబడితో సాగు చేపట్టి అధిక ఆదాయం పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కో ఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ సూచించారు. మండల కేంద్రంలోని రైతువేదికలో శుక్రవారం రైతులతో ఏర్పాటు చేసిన చర్చా గోష్టిలో ఆమె మాట్లాడారు. రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడాలని సూచించారు. తోటపంటలు, కూరగాయల సాగుతో ఆదాయం సాధించవచ్చని అన్నారు. అశ్వారావుపేట వ్యవసాయ సంచాలకుడు రవికుమార్, కేవీకే వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన్‌కుమార్, శివ ఆధునిక సాగులో మెళకువలు వివరించారు. ములకలపల్లి, దమ్మపేట మండల వ్యవసాయాధికారులు (ఎంఏఓ) అరుణ్‌బాబు, చంద్రశేఖర్, రైతు ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు కరుటూరి కృష్ణ, ఏఈఓలు మనోహర్, రమేశ్, రాహుల్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

మరింత ఆకర్షణీయంగా అర్బన్ పార్క్



ఓపెన్ జిమ్‌లో సాధన చేస్తున్న భీమానాయక్

ఇల్లెందురూరల్: కోరగుట్ట వద్ద అటవీశాఖ తీర్చిదిద్దిన అర్బన్ పార్క్‌ను రానున్న రోజుల్లో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతామని అటవీశాఖ సీసీఎఫ్ భీమానాయక్ అన్నారు. మండలంలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని అటవీశాఖ అర్బన్ పార్క్‌ను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పార్క్‌లో ఇటీవల ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్, చిన్నపిల్లలు ఆడుకునే వస్తువులు, వాచ్‌టవర్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పార్క్ నిర్మాణంలో భాగంగా ప్రారంభంలో వాకింగ్ ట్రాక్‌లు ఏర్పాటు చేశామని, సందర్శకులు సేదతీరేలా చిన్నపాటి గుడిసెలు అక్కడక్కడా నిర్మించామని తెలిపారు. భవిష్యత్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించి, పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ కృష్ణగౌడ్, ఎఫ్ఆర్ఓ ప్రసాద్, డీఆర్ఓ వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీలో ప్రతిభ



ఉద్యోగులను అభినందిస్తున్న సీఈ బిచ్చన్న

మణుగూరురూరల్: క్రీడల్లో రాణించి బీటీపీఎస్ కీర్తిని పెంచాలని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ సీఈ బిచ్చన్న ఆకాంక్షించారు. మూడు రోజులుగా చెల్పూర్‌లోని కాకతీయ థర్మల్ పవర్ స్టేషన్‌లో జరిగిన టీజీ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ షటిల్, బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బీటీపీఎస్ ఉద్యోగులు ప్రతిభ కనబర్చి తృతీయ స్థానంలో నిలిచిరాఉ. శుక్రవారం వారు సీఈ బిచ్చన్నను కలివగా ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఈ అడ్మిన్ పార్వతి, డీఈ మురళీకృష్ణ, స్పోర్ట్స్ కార్యదర్శి కల్తీ నర్సింహారావు, జట్టు మేనేజర్ వెంకట్, జట్టు కెప్టెన్ బి.సత్యనారాయణ, సభ్యులు డి.సతీశ్‌రెడ్డి, బి.శ్రీనివాసులు, వై.శ్రీనివాస్, కె.శ్రీకాంత్, డి.సురేశ్, బి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారులపై దాడికి యత్నం: కేసు నమోదు



మాట్లాడుతున్న ఫారెస్ట్ అధికారులు

టేకులపల్లి: అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను అడ్డుకునేందుకు అటవీశాఖ అధికారులు యత్నించారు. వారు ట్రాక్టర్లు ఆపకుండా వెళ్లారు. నిందితులు చంద్రుతండావాసులుగా గుర్తించి, అక్కడికి వెళ్లగా వారు దాడికి యత్నించారు. మండలంలోని శంభూనిగూడెం అటవీ ప్రాంతం ముర్రేడు వాగు నుంచి శుక్రవారం ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తుండగా సమాచారం తెలుసుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హారిక ఆధ్వర్యంలో.. ఆపే ప్రయత్నం చేశారు. అయినా వారు ట్రాక్టర్లను ఆపకుండా వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న కొత్తగూడెం రేంజర్ శ్రీనివాస్, డీఆర్ఏ తోలెం వెంకటేశ్వర్లు.. చంద్రుతండాకు వెళ్లగా ఫారెస్టు అధికారులకు గ్రామస్తులకు మధ్య ఘర్షణ జరిగింది. ఉద్యోగులు హారిక, దేవసింగ్, దేవి, రామ్మూర్తి, భావ్‌సింగ్ తదితరులు ఉన్నారు. కాగా, ఘటనపై సెక్షన్ ఆఫీసర్ హారిక ఫిర్యాదు మేరకు ఐదుగురు చంద్రుతండావాసులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ సురేశ్ తెలిపారు.

క్వింటాన్నర ముష్టిగింజల పట్టివేత

గుండాల: మండలం నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న క్వింటాన్నర ముష్టి గింజలను శుక్రవారం జీసీసీ అధికారులు పట్టుకున్నారు. అన్నపురెడ్డిపల్లి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గుండాల మండలంలోని పలు గ్రామాల నుంచి ముష్టి గింజలను కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా జీసీసీ అధికారులు పట్టుకున్నారు. కొంతకాలంగా జీసీసీకి రావాల్సిన అటవీ ఉత్పత్తులను బయట నుంచి వచ్చిన వ్యక్తులు అక్రమంగా తరలిస్తున్నారని సేల్స్‌మెన్ అంబటి శ్రీనివాస్ తెలిపారు. ఈ ముష్టిగింజలను స్వాధీనం చేసుకుని, పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు.



ముష్టి గింజలను పట్టుకున్న జీసీసీ సిబ్బంది

తాటి చెట్టు మీదపడి చిన్నారి మృతి



ప్రసన్నశ్రీ మృతదేహం

దుమ్ముగూడెం: మండలంలోని కోయనరసాపురం గ్రామంలో తాటి చెట్టు మీద పడి చిన్నారి సోందే ప్రసన్నశ్రీ (3) మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మృతురాలి తల్లి సోందె సుమలత ఇంటి పక్కన గల ఎండిపోయిన తాటి చెట్టుకు నిప్పు పెట్టింది. ఆ పక్కనే ఉన్న మామిడి చెట్టు కొమ్మలపై ముగ్గురు ఆడపిల్లలు ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో తాటి చెట్టు మామిడి చెట్టుపై పడుతుండటాన్ని గమనించిన ఇద్దరు పిల్లలు అక్కడి నుంచి పరుగుతీశారు. కానీ, ప్రసన్నశ్రీ అక్కడే ఉండటంతో తాటి చెట్టు మీద పడింది. భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలపడంతో తల్లిదండ్రులు శోకసముద్రంలో మునిగారు.

మద్యం తాగొద్దనడంతో ఆత్మహత్య

అశ్వారావుపేటరూరల్: కూలీ పనులు చేస్తే వచ్చే డబ్బులన్నీ మద్యానికి ఖర్చు చేయొద్దని భార్య మందలించడంతో భర్త పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన ఇది. ఎస్ఐ యయాతి రాజు కథనం ప్రకారం.. మండలంలోని భీమునిగూడేనికి చెందిన ఎర్రం నర్సింహారావు (55) కూలీ పనులు చేస్తుంటాడు. ఏడాది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. కూలీ డబ్బులు ఖర్చు చేస్తుండటంతో గురువారం దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. మనస్తాపానికి గురైన నరసింహారావు పురుగులమందు తాగాడు. కుటుంబీలకు ఖమ్మం ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం, రుద్ర హోమ పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలోని యాగశాలలో గణపతి పూజ, రుద్రహోమం, పూర్ణాహుతి జరిపారు. అనంతరం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, , పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. ఆ తర్వాత ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈఓ రజనీకుమారి, అర్చకులు భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలతో జీవనోపాధి పొందాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

భద్రాచలం: గిరిజన నిరుద్యోగులు ప్రభుత్వ సంక్షేమ పథకాల జీవనోపాధి పొందాలని ఐటీడీఏ పీఓ బి రాహుల్ సూచించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం ఆవరణలో ట్రైకార్ గ్రామీణ రవాణా పథకం కింద మంజూరైన వాహనాలను లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. వాహనాలను ఖాళీగా ఉంచొద్దని, రవాణాకు వినియోగిస్తూ ఆదాయం పొందాలని చెప్పారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు కూడా ముందుకు రావాలని చెప్పారు.

సీఎం బసకు ఇబ్బందులు రావొద్దు

శ్రీరామనవమికి భద్రాచలం రానున్న సీఎం, ఇతర ప్రముఖులు హౌసింగ్ గెస్ట్ హౌస్, గిరిజన భవనాల్లో బస చేసే అవకాశం ఉందని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఆ రెండు భవనాలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, ఫీడర్‌లను ప్రారంభించి మాట్లాడారు. వీవీపీలకు అసౌకర్యం కలుగకుండా మైనర్ రిపేర్లను పూర్తి చేయాలని ఆదేశించారు. గెస్ట్‌హౌస్‌ను ముస్తాబు చేయాలని సూచించారు. అధికారులు డేవిడ్ రాజ్, రేణు, అశోక్ కుమార్, శ్రీనివాస్, రవి, జీవన్ కుమార్, దుర్గాప్రసాద్, రాజారాం, చలపతి పాల్గొన్నారు.

విద్యుత్ అభివృద్ధి పనులపై కార్యాచరణ

ఎన్పీడీసీఎల్, ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా అధికారుల సమావేశం



సమావేశంలో పాల్గొన్న రెండు జిల్లాల అధికారులు

ఖమ్మంవ్యవసాయం: రానున్న వానాకాలం, యాసంగి పంటల సీజన్లలో విద్యుత్ వినియోగం అంచనా, నిర్వహించాల్సిన పనులపై టీజీ ఎన్పీడీసీఎల్, ట్రాన్స్‌కో ఉమ్మడి జిల్లా అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఖమ్మంలోని ఎన్పీడీసీఎల్ సర్కిల్ కార్యాలయంలో రెండు సంస్థల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలస్థాయి అధికారుల సమన్వయ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రానున్న పంట సీజన్లలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నాణ్యమైన, మెరుగైన సరఫరా చేయడంపై చర్చించారు. 220/132 సబ్‌స్టేషన్లలో చేపట్టాల్సిన పనులు, అందుకు కావాల్సిన నిధులపై ప్రతిపాదనలు రూపొందించారు. వానాకాలం పంటల సీజన్ నాటికి నూతన విద్యుత్ లైన్ల ఏర్పాటు, ప్రస్తుతం జరుగుతున్న పనులను పూర్తి చేయడంపై దృష్టి సారించాలని నిర్ణయించారు. అలాగే, విద్యుత్ వినియోగం ఆధారంగా అవసరమైన చోట్ల నూతన సబ్‌స్టేషన్ల ఏర్పాటుపైనా చర్చించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ బి.శ్రీనివాస్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల ఎన్పీడీసీఎల్ ఎస్ఈలు ఇనుగుర్తి శ్రీనివాసాచారి, జి.మహేందర్ పాల్గొన్నారు.

జేకేఓసీలో డైరెక్టర్ పర్యటన



పని ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్లు

ఇల్లెందు: సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె.వెంకటేశ్వర్లు శుక్రవారం ఇల్లెందు జేకేఓసీలో పర్యటించారు. పని స్థలాలు, పనులను పరిశీలించారు. రోజువారీ ఉత్పత్తి, రవాణా వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోజువారీ బొగ్గు రవాణా లక్ష్యాలను అధిగమించాలని కోరారు. నూతన జేకే కోల్‌మైన్ ఓసీకి సంబంధించిన స్థలాలను పరిశీలించారు. త్వరగా పనులు పూర్తి చేసి బొగ్గు రవాణా జరిగేలా చూడాలని జీఎంను ఆదేశించారు. ఆయన వెంట జీఎం కృష్ణయ్య, పీఓ కృష్ణమోహన్‌రావు, మేనేజర్ పూర్ణచందర్, సెక్యూరిటీ అధికారి అంజిరెడ్డి ఉన్నారు. కాగా, డైరెక్టర్ వెంకటేశ్వర్లును ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కె.సారయ్య ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలిసి నూతన ఓసీని ప్రారంభించాలని, కార్మికులను బదిలీ చేయొద్దని, జేకే ఓసీలో బొగ్గు వెలికి తీసే పనులు కొనసాగించాలని కోరారు.